# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల*

*(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)*

## 8

**మర్నాడు దిన పత్రికల్లో తమ** వివాహం మీద వచ్చిన వార్తని చదివాడు. సౌదామినికి అందులోని తమ ఫోటోలని చూపించి ఆ వార్తని బయటకి చదివి వినిపించాడు.

చిత్రంగా రాష్ట్ర గవర్నర్ నుంచి అభినందన లేఖ ఒకటి పరాంకుశానికి హేండ్ డెలివరీ చేయబడింది.

రోజులు గడిచే కొద్దీ తను సౌదామినిని మార్చగలను అన్న అభిప్రాయం పరాంకుశంలో బలపడసాగింది.

వారం రోజుల సెలవు తర్వాత ఆఫీసుకి వెళ్ళాడు పరాంకుశం.

పరాంకుశం పెళ్ళి గురించి అందరూ అనేక విధలుగా అనుకుంటున్నారు. ముఖం మీద అనకపోయినా, కొలీగ్స్ అనుకునేవి శ్రీకంఠం ద్వారా తెలుస్తున్నాయి. మరికొందరు పనికట్టుకుని పరాంకుశం సీటు దగ్గరికి వచ్చి చెప్పిపోతున్నారు. యాభైమంది పైనే ఉన్న ఆ ఆఫీసులో ఒకొక్కరూ ఒక్కొక్క విధంగా కామెంట్ చేస్తున్నారు.

"సంసార పక్షపు స్త్రీ అయితే భర్త కోరే విపరీత కోరికలకు అంగీకరించదు. అదే వ్యభిచారయితే అలవాటు కనక మారు మాట్లాడదు."

"తనేదో పెద్ద సంఘసేవకుడినని అందరూ అనుకోవాలని, తనని గొప్పవాడిగా అంతా అనుకోవాలని చేసుకున్నాడు ఈ పెళ్ళి. ఇదో పిచ్చి. ఈ పెళ్ళి ఎక్కువ రోజులు నిలవదు. కావలిస్తే చూస్తుండండి."

"మనకి తెలియని రహస్యం ఏదో ఉంది. మామూలుగా అందరిలాగా పెళ్ళిచేసుకుంటే అది బైటపడిపోతుందని ఈ వ్యభిచారిని చేసుకున్నాడు. ఏదో స్వంత లాభం లేకపోతే ఇలా చేయడానికి పిచ్చివాడు కాడు పరాంకుశం."

ఎవరికి తోచినట్లు వాళ్ళు పరాంకుశాన్ని విమర్శించారు. పరాంకుశం ఎవరి ఎత్తిపొడుపు మాటలకు అధైర్యపడలేదు. చేష్టలకి అవమానంతో క్రుంగిపోలేదు. అందరూ చూసే చిన్న చూపుకి విసిగి వేసారిపోయి, తనంతట తనే లేనిపోని బాధలు సృష్టించుకోలేదు. ఇది లోకం తీరు అనుకుని నవ్వుకున్నాడు. అంతే!

సౌదామినిలో రెండు లక్షణాలని పరాంకుశం గమనించాడు. తనకి నచ్చితే, చెప్పగానే చేస్తుంది. నచ్చకపోతే మాత్రం ఏం చేసినా ఆ పని చెయ్యదు. కళాకళలు!!

పరాంకుశం పెళ్ళయిన దగ్గర్నుంచీ ఒక్క క్షణం కూడా వృధా చేయలేదు. వెలయాలైన సౌదామినిని ఇల్లాలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

నాయుడు పంపిన పుస్తకాల్లోని అనేక సూత్రాలని ఆచరిస్తున్నాడు. తన కోపాన్ని చంపుకుంటున్నాడు. ఓ నోట్‌బుక్‌లో ప్రతి ఆదివారం రాత్రి సౌదామిని ఆ వారంలో ఏమైనా అభివృద్ధి చెందిందా, చెందితే ఏ విషయంలో ఎంత, ఇంకా ఏమయినా తగిన చర్యలు తీసుకోవాలా మొదలయిన వివరాలు రాసుకుంటున్నాడు,

సౌదామినిని తనలా ఓ ఆదర్శ ఇల్లాలుగా తీర్చిదిద్దేందుకు పరాంకుశం అక్కయ్య కూడా తన శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

సౌదామిని వంట నేర్చుకుంది. వడ్డన నేర్చుకుంది. చక్కగా సంసార పక్షంగా చీర కట్టుకోవడం నేర్చుకుంది. ఎవరయినా కొత్తవారిని పరిచయం చేసినపుడు నమస్కారం చేసి, కూర్చోమనటం నేర్చుకుంది. మాటమాటికీ పైట సర్దుకోవడం మానుకుంది. కుడి వక్షోజం బయటికి కనపడేలా కొంగుని వేసుకోవడం మానుకుంది.

పరాంకుశం అక్కయ్యని గౌరవంగా 'మీరు' అని పిలవడం నేర్చుకుంది. కొన్ని తనంతట తనే, పరాంకుశం చెప్పకుండానే నేర్చుకుంది.

ఉదయం ఏడు గంటలకే లేస్తుంది. రాత్రి పదిన్నరకల్లా పడుకుంటుంది. గంగాళాలనిండా బావి నుంచి నీళ్ళు తోడుతుంది. ముగ్గురికీ నీళ్ళు కాస్తుంది. పరాంకుశానికి తువ్వాలు, సబ్బు అమర్చి నీళ్ళకి పిలుస్తుంది.

పరాంకుశం అక్కయ్యతో కబుర్లు చెపుతూ వంట చేస్తుంది. బట్టలు ఉతుకుంది. ఇల్లు ఊడుస్తుంది. పక్కలు వేస్తుంది. ఇంటి ముందు ముగ్గులు వేస్తుంది. తోటలోని చెట్లకి నీళ్ళు పోస్తుంది. సమస్తమూ చేయటం నేర్చుకుంది.

సాయంత్రం రామాయణమో, భాగవతమో చదువుతుంది, రేడియో వింటుంది. పరాంకుశం దగ్గర ఇంగ్లీష్, తెలుగు నేర్చుకుంటుంది. సౌదామినిని ఖాళీగా ఉంచడం లేదు పరాంకుశం, అతని అక్కయ్యలు.

సౌదామిని భాష మార్చేందుకు అక్కా తమ్ముళ్ళిదరూ చాలా తంటాలు పడ్డారు. సౌదామిని నోటివెంట అశ్లీలపు మాటలు అలవాటుగా అనుకోకుండా వచ్చేస్తాయి. ముఖ్యంగా బాగా సంతోషం వచ్చినా, కోపం వచ్చినా సౌదామిని బూతు పదాలు వాడుతుంది.

అలా చెడ్డమాటలు మాట్లాడినప్పుడల్లా పరాంకుశం, పరాంకుశం అక్కయ్యా ఇద్దరూ మౌనంగా ఉండిపోతారు. తాము చెప్పేది మధ్యలో ఆపేస్తారు. ఇంక మాట్లాడరు. సౌదామినితోనే కాదు, తమలో తము మాట్లాడటం కూడా ఆపేస్తారు.

తను వాడకూడని పదాలు వాడానని సౌదామిని వాళ్ళ మౌనం ద్వారా కొద్దిక్షణాల్లో గ్రహిస్తుంది. వెంటనే సిగ్గుపడిపోతుంది. లేచి దేవుడి గదిలోకి వెళ్ళిపోతుంది. అక్కా తమ్ముళ్ళిద్దరికీ సౌదామిని గట్టిగా మూడుసార్లు వేసుకునే లెంపలు వినబడి ఒకరిని చూసి ఒకరు నవ్వుకుంటారు. సౌదామిని వచ్చి మళ్ళీ కూర్చుంటుంది. మళ్ళీ ఎప్పటిలా వాళ్ళ సంభాషణ సాగుతుంది. ఒక్కొక్కసారి సౌదామినికి విసుగేస్తుంది, దేవుడి గదిలోకి మాటి మాటికీ అలా వెళ్ళిరావటానికి.

పెళ్ళయిన తరువాత వారం రోజుల్లో, ప్రతీ అరగంటలో పదిసార్లు దేవుడి గదిలోకి అలవాటులోని పొరపాటువల్ల వెళ్ళివచ్చేది. పదిహేనురోజుల్లో సౌదామిని వాడే భాషలో ఏభై శాతం అభివృద్ధి కనిపించింది.

ఏకాంతంగా ఉన్నప్పుడు తప్ప పరాంకుశాన్ని ఇతరుల ముందు 'బుల్లోడా' అని పిలవదు సౌదామిని. ఇదివరకటిలా మీద చేతులు వెయ్యదు.

భోజనం అయాక తమలపాకులు తప్ప జర్దా కిళ్ళీ వేసుకోదు. పరాంకుశం, సౌదామిని ఇద్దరూ సిగరెట్లు మానేశారు. సౌదామినికి తెలియకుండా రహస్యంగా ఆఫీస్‌లో మాత్రం పరాంకుశం సిగరెట్ కాలుస్తాడు.

ఓ రోజు అతనికి అది తప్పని, సౌదామినిని మోసం చేయడం అని అనిపించటంతో సిగరెట్ పెట్టని డస్ట్ బిన్‌లో పడేసాడు. మళ్ళీ సిగరెట్ జోలికి వెళ్ళలేదు పరాంకుశం.

పెళ్ళయిన నెలరోజుల్లోనే సౌదామినిలో చాలా అభివృద్ధి కనబడింది, మొట్టమొదటిసారి తను ఆ సందులో చూసిన సౌదామినికి, ఇప్పటి సౌదామినికీ ఎంతో వ్యత్యాసం, మార్పు పరాంకుశానికే తెలుస్తోంది. దుస్తుల్లో, నడకలో, చూపుల్లో, కదలికలో, నవ్వులో - ప్రతి విషయంలో మార్పు వచ్చింది.

రానిదల్లా రెండే రెండు విషయాల్లో. ఆ రెండూ ముఖ్యమైనవే.

పడకగదిలో, మనస్తత్వంలో.

రాత్రిళ్ళు పడక గదిలో పరాంకుశం దగ్గర శ్రోత్రికురాలిలా, ఇల్లాలిలా ప్రవర్తించదు. ఏమాత్రం సిగ్గుపడదు. విశృంఖలంగా, పరాంకుశం దృష్టిలో కొంచె అసహ్యం అనిపించేటట్లుగా ప్రవర్తిస్తుంది.

ఒక్కొక్కసారి పాత విటుల గురించి, వాళ్ళతో అనుభవాల గురించి చెపుతుంది. పరాంకుశం పాత విషయాలు మాట్లాడవద్దని ఎన్నో విధాల చెప్పి చూసాడు. అయినా కొంచెం కూడా మార్పు రాలేదు. అతను మాత్రం అసహనాన్ని ప్రదర్శించడు. కోపాన్ని బలవంతంగా నియంత్రించుకుంటాడు.

పరాంకుశం అంటే సౌదామినికి బాగా ఇష్టం ఏర్పడింది. ఆ ఇష్టాన్ని రాత్రిపూటే ప్రదర్శిస్తుంది, తనకి తెలిసిన ఒకే ఒక పద్ధతిలో.

పరాంకుశాన్ని కదలనియ్యదు. విశాంతి తీసుకోనివ్వదు. ఊపిరాడనివ్వదు. విడిగా ఉండనివ్వదు. రాత్రిళ్ళు చాలా భాగం నిద్రకు నోచుకోలేదు పరాంకుశం. సౌదామిని ధాటికి తట్టుకోలేకపోతున్నాడు.

అందుకే హేవ్‌లాక్ ఎల్లిస్ రాసిన, బెర్‌ట్రాండ్ రస్సెల్ మెచ్చుకున్న "సైకాలజీ ఆఫ్ సెక్స్" చదువుతున్నాడు. అక్కడక్కడ ఆసక్తి కలిగించే పాయింట్స్ ఆ పుస్తకంలో పరాంకుశానికి దొరుకుతున్నాయి. అది నాయుడు పెళ్ళికి పంపిన బహుమతి పుస్తకాల్లో ఒకటి.

తగిన సలహాలు ఇమ్మని వారానికో ఉత్తరం రాస్తున్నాడు హైదరాబాదులోని నాయుడికి. నాయుడు నుంచి తిరుగుటపాలో వచ్చే సలహాలు ఆచరిస్తున్నాడు.

రెండవది - మార్పు రాని మనస్థత్వం. పరిణితి చెందకుండా సౌదామిని మానసికంగా స్థబ్దుగానే ఉంది. అలవాట్లు, కట్టుబాట్లు లాంటి బైటికి కనబడేవైతే మారాయి కాని, ఆలోచనా దృక్పథం, మానసిక పరివర్తనలాంటి కనపడనివి ఎంతమాత్రం విశాలం కాలేదు.

"శీలం, శీలం అంటావు. అది ఎలా ఉంటుందో చూపించు."

"పవిత్రత శీలం అంటే."

"పవిత్రతని చూపించు పోని."

ఒంటరిగా రాత్రిళ్ళు పడకగదిలో భార్యా భర్తలిద్దరూ వాదించుకుంటారు.

"సీత, సావిత్రి మొదలయిన వాళ్ళు అంతా శీలవంతులు."

"వచ్చింది గొర్రె. మళ్ళీ మొదటికొచ్చాం. వాళ్ళు శీలవంతులు అవకపోతే వచ్చే నష్టం ఏమిటి?"

సమాధానం ఆలోచించాడు కాని, పరాంకుశానికి అది ఆమెకి అర్ధం అయేలా ఎలా చెప్పాలో అర్ధం కాలేదు...

"పాపం వస్తుంది." చెప్పాడు.

"చూపించు పాపాన్ని."

"యమలోకంలో యముడు బాధలు పెడతాడు. కాగే నూనెలో వేస్తాడు. రంపాలతో ఒంటిని కోయిస్తాడు, పాములతో కరిపిస్తాడు."

"ఛత్, అంతా అబద్ధం. ఊరికే అలా భయపెడతారు అంతే. యముడూ లేడూ, యమలోకమూ లేదు.". 'శీలం' అంటే ఆమె మనసులో ఎక్కేలా, వివరంగా అర్థమయ్యేలా చెప్పలేకపోయాడు పరాంకుశం సౌదామినికి. కారణం వయసు వచ్చిన దగ్గరనుంచి 'శీలం ప్రధానం స్త్రీకి' అనే విధంగా ప్రవర్తించే, బోధించే తల్లిదండ్రులు లేకపోవటం, శీలం లేని మనుషుల మధ్య పెరగడం.

ఇంగ్లీష్ వాళ్ళకి 'మడి', 'ఎంగిలి' అంటే ఏమిటో అర్థమయేలా చెప్పటం అంత కష్టమో, సౌదామినికి శీలం అంటే అర్థం అయేలా చెప్పటం అంత కష్టం అనిపించింది పరాంకుశానికి. సౌదామిని నిఘంటువులో శీలం అనే పదానికి అర్థం లేదు.

శీలం అంటే భ్రమ అనీ, మిధ్య అనీ, అది పురాణాలకే పరిమితమనీ, నిజ జీవితంలో దాని ఉపయోగం పూజ్యం అనీ వాదిస్తుంది. మొగుడుతో కలిసినప్పుడు తప్పులేకపోతే, మరొకడితో కలవటంలో తప్పులేదు అంటూంది.

చర్చ తీవ్రంగా జరుగుతున్నప్పుడు సౌదామిని ధారాళంగా బూతుపదాలు వాడుతుంది. పరాంకుశం వెంటనే తగ్గిపోతాడు. సౌదామిని ఆవేశం తగ్గాక మళ్ళీ ప్రారంభిస్తాడు వాదన.

నాయుడు పంపిన అరడజను పుస్తకాల్లో మరో పుస్తకం 'ది సైకాలజీ ఆఫ్ ఏ ప్రాస్టిట్యూట్'. ఫ్రెంచ్ భాష నుంచి ఇంగ్లీషులోకి తర్జుమా చేయబడ్డ అందులో సగటు వ్యభిచారి మనస్థత్వం చక్కగా వర్ణించబడింది. అలాంటి మనస్థత్వం కలిగి ఉండటానికి గల కారణాలని కూడా ఆ పుస్తకం విశదీకరించింది.

చాలా విషయాల్లో ఆమె దృక్పథం మారలేదు. చివరికి విసిగిపోయి నాయుడికి ఉత్తరం రాసాడు పరాంకుశం.

"ఎంత ప్రయత్నించినా సౌదామిని మనస్థత్వం మారడం లేదు. అలవాట్లు, వేషభాషలు ఇల్లాలివే అయినా, ఆలోచనలు, మనసు వ్యభిచారివి. అది నేను భరించలేను. మనిషికి మంచి మనసు ముఖ్యం. మనసు మంచిది కాకపోతే మనిషి చెడిపోయే అవకాశం ఎక్కువ. "

సౌదామిని మనసులో ఒక విషయం బాగా నాటుకుపోయింది. పురుషుడికి సుఖాన్ని అందిస్తున్నందుకు ప్రతిగా డబ్బు తీసుకోవాలి. సుఖం ఇస్తున్నందుకు పురుషుడు ఇష్టపడి డబ్బు స్వయంగా ఇస్తున్నప్పుడు దాన్ని ఉత్తి పుణ్యానికి వదులుకోవడం ఎందుకు? డబ్బు లభిస్తున్నంత కాలం, దాన్ని సంపాదించుకోవడం వివేకం. వదులుకోవడం అవివేకం. అందులో ఎంతమాత్రం తప్పులేదు.

సౌదామినిని ఈ ఘోరమయిన ఆలోచనలోంచి, ఆ సుడిగుండపు వలయాల్లోంచి ఎలా బయటికిలాగాలో పాలుపోవడంలేదు నాకు. ఏంచెయ్యను?

ఆ ఉత్తరానికి నాయుడు దగ్గరినుంచి కొంచె ఆలస్యంగా సమాధానం వచ్చింది.

"ఆ మనస్థత్వాన్నే వ్యభిచారం అంటారు. చాలామంది మంచివాళ్ళలో కూడా ఇది కొద్దో గొప్పో ఉంటుంది అని మానసిక శాస్త్రవేత్తల అంచనా.

సౌదామినికి బాల్యం నించే ఉన్న ఆ నమ్మకం పోవటం కష్టం. నేను సూచించే ఈ జాగ్రత్తలు పాటించండి.

సౌదామినికి డబ్బు అవసరం రాకుండా చూసుకోండి. వస్తే స్వంతంగా సంపాదించుకోవాలన్న ఆలోచన రావచ్చు.

సౌదామిని మిమ్మల్ని బాగా ప్రేమిస్తోంది కాబట్టి, ఎప్పుడయినా సౌదామిని తప్పుచేస్తే మీరు భరించలేరని, సౌదామిని నుండి విడిపోతానని పదే పదే చెపుతుండండి. మీరు అన్నంత పని చేస్తారన్న భయంతో అంత సాహసం చెయ్యదు.

మన సమాజంలో అన్నిరకాల వాళ్ళూ ఉన్నారు. సౌదామినిని వాడుకుందామనే దృష్టి ఉండే తుచ్చులని దూరంగా ఉంచండి.

క్రమంగా సౌదామినిలో మార్పు తప్పకుండా వస్తుంది. అప్పటిదాకా నే చెప్పిన జాగ్రత్తలు తీసుకోండి. ఉత్తరాల్లో మీరు రాసే విషయాలని బట్టి మంచి ప్రగతినే సాధించారు అని నాకు అనిపిస్తోంది. ఆల్ ది బెస్ట్."

పరాంకుశానికి తెలుసు, నాయుడు రాసినవి కేవలం జాగ్రత్తలని. ప్రికాషనరీ మెషర్స్ ఎప్పుడూ ప్రివెంటివ్ మెషర్స్ కావు.

సౌదామినికి పరాంకుశం అంటే వెర్రిప్రాణం. పరాంకుశం ఆఫీస్ నుంచి ఆలస్యంగా వస్తే పదిసార్లు బయటికి, లోపలికి తిరుగుతుంది. తలనొప్పి వస్తే అమృతాంజనం రాస్తుంది. పరాంకుశానికి కావలసిన వస్తువులన్నీ తనే స్వయంగా సమకూరుస్తుంది. పరాంకుశం అంటే ఉన్న ఇష్టాన్ని, ప్రేమని కేవలం పడక గదిలోనే కాకుండా, బయట కూడా దినచర్యలో ఏవిధంగా చూపించవచ్చో నేర్చుకుంది.

ఇదివరకు తను జీవించిన ఆ సందులోని జీవితం తనుండే గదిలానే చీకటిగా, ఇరుగ్గా ఉండేది. కాని, ఇక్కడ దానికి పూర్తిగా వ్యతిరేకం తను ఖైదీ కాదు. స్వతంత్రం, స్వేచ్ఛా ఉన్నాయి.

'తన ఇల్లు, తన సంసారం' అన్న స్వార్థం ఏర్పడింది. ఇంట్లో ఏ పని చేస్తున్నా తన సంసారం కోసమే చేసుకుంటున్నానని తృప్తి.

రెండు నెలల తరువాత తన పాత జీవితాన్ని, కొత్త జీవితాన్ని పోల్చి చూసుకుంటే కొత్త జీవితమే తృప్తిగా, హాయిగా ఉంది సౌదామినికి. ఎలాగయినా సరే ఈ జీవితాన్ని వదులుకోకూడదు అనే స్థిరమయిన నిశ్చయానికి వచ్చింది.

పరాంకుశం మాత్రం నాయుడు సలహాని పాటిస్తున్నాడు. చాలా తరచుగా సౌదామినికి గుర్తుచేస్తుంటాడు, పాత జీవితంలో లాగా ఆమె ఏమైనా తప్పు చేస్తే క్షమించలేనని, వెళ్ళగొడతానని. అలా భయంలో ఉంచడం మంచిదని రాసిన నాయుడు ఉత్తరం పరాంకుశం మీద బాగా పనిచేసింది గనక, సౌదామినిని జారిపోనివ్వటం లేదు ఈ విషయంలో.

✷✷✷

సౌదామిని, పరాంకుశంల పెళ్ళి అయి నాలుగు నెలలయింది. సౌదామినిని ఎవరయినా చూస్తే, నాలుగు నెలల క్రితం పక్కా వ్యభిచారి అని చెప్పినా నమ్మలేరు. ఓ గంట మాట్లాడితే మాత్రం రెండు మూడు మాటల్లో ఆ సంగతి చూచాయగా తెలుస్తుంది. అంతే!

సౌదామినిని, అక్కా తమ్ముళ్ళని ఆ సందులో అంతా వెలివేసారు. పెళ్ళి, పేరంటాలకి కాని, పండగలకి కానీ ఎవరూ పిలవరు, పలకరించరు. కనపడితే క్షయవ్యాధి ఉన్న రోగి నుంచి తప్పుకునట్లుగా మొహం తిప్పుకుని దూరంగా వెళ్ళిపోతారు. దాంతో వారికి ఇరుగు పొరుగు ఉన్నా లేనట్లే . పాలు తోడేయడానికి మజ్జిగ చుక్క కావాలన్నా వారినుంచి సహాయం లభించదు.

వెనకాల నవ్వుకుంటారు. కొందరు ఆకతాయివాళ్ళు పిచ్చిపిచ్చిగా అరుస్తారు. ఈలలు వేస్తారు. కానీ, వాళ్ళకే విసుగొచ్చి క్రమంగా ఆ గోల తగ్గిపోయింది.

ఆ సందులో చాలా మంది ఎలాగయినా సరే పరాంకుశం కుటుంబాన్ని ఆ ఇంట్లోంచి ఖాళీ చేయించాలని పట్టుపట్టి శతవిధాల ప్రయత్నం చేశారు. అలాంటివాళ్ళు ఉంటే, తమ ఇళ్ళలోని ఆడపిల్లలు చెడిపోతార్ని గోలపెట్టారు.

కానీ, వాళ్ళ ఆటలేం సాగలేదు. ఆ ఇంటి యజమాని గట్టి పిండం. దానికి తోడు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సహకారం ఉంది. చివరికి విసుగెత్తి వాళ్ళు ఊరుకున్నారు. పరాంకుశం ఇంటికి వచ్చాక ఆ సందులోని వాళ్ళ సౌదామినిని చాలా తక్కువసార్లే చూసారు. ఇల్లు రోడ్డు మీదకి లేదు, ముందు తోట ఉండటం వల్ల దూరంగా ఉంది. పరాంకుశం కానీ, అతని అక్కయ్య కానీ చూస్తే కోప్పడతారని సౌదామిని వీధిగుమ్మంలోకి వచ్చి నిలబడదు.

ఆ నాలుగు నెలల్లో సౌదామిని వారానికి రెండు మూడు సార్లు మించి బయటకి వెళ్ళలేదు. అది కూడా పరాంకుశంతోనే. కాబట్టి ఆ సందులోని వాళ్ళ ఊహల్లో సౌదామిని వివిధ రూపాల్లో ఉంది. ఒక్కరి ఊహ కూడా సరైంది కాదు.

పోస్ట్ మేన్, ఎలక్ట్రిక్ మీటర్ రీడింగ్ చూసే అతను, మలేరియా శాఖలో పనిచేసే అతను తప్ప ఆ నాలుగు నెలల్లో ఒక్కసారైనా గుమ్మందాటి లోపలికి మరే మగాడు రాలేదు. శ్రీకంఠం కూడా రాలేదు.

ఒకరోజు ఆఫీసునుంచి తిరిగి వస్తుండగా అమ్మాజీ ఇంట్లోని రూము ఎదురుగా ఉన్న ఇంట్లో భార్యని అనుమానంతో చావబాదే అతను కనపడి పలకరించాడు పరాంకుశాన్ని.

"ఎలావుంది అమ్మాజీ?" అడిగాడు పరాంకుశం

"వారం రోజుల క్రితం ఊరెళ్ళింది." చెప్పాడు పరాంకుశం చేతి వాచీ వంకా, బట్టలవంకా దీక్షగా చూస్తూ.

"ఏమిటి చూస్తున్నారు?" అడిగాడు పరాంకుశం.

"ఏం లేదు. పెళ్ళయిందా?"

తల ఊపాడు పరాంకుశం నవ్వి.

"అవును. ఆ మధ్య పేపర్లో మీ ఇద్దరి గురించీ రాసారు. ఫోటోలు కూడా వేసారు కదా ఎంతాశ్చర్యం వేసిందో. నువ్విలాంటి వాడివి అని ఎన్నడూ అనుకోలేదు నేను."

"ఎలా ఉంది మీ ఆవిడ?" ఉడికించాలని అడిగాడు పరాంకుశం కావాలని.

"లేచిపోయింది." పిడికిలి బిగించి కోపంగా చెప్పాడు.

"అరె! ఎప్పుడు?"

"నెల క్రితం. మీరు ఖాళీ చెయ్యగానే ఓ ముప్పై ఏళ్ళతను అద్దెకి కొత్తగా వచ్చాడు. వాడితో లేచిపోయింది. ఉన్నన్నాళ్ళూ ఏడిపించి పోయింది మరీ."

జాలివేసింది పరాంకుశానికి.

"ఉత్తరం రాసిపెట్టి వెళ్ళింది, వెళ్ళేటప్పుడు నేను అనుమానించి కొట్టడం వల్లనే వెళ్ళిపోయిందంట. తప్పు నా మీద వేసేందుకు ఆ ఉత్తరం. అది మంచిది కాదని అందరికీ తెలుసు."

"మీరెప్పుడయినా ఆమె చెడుగా తిరగటం చూసారా?"

"చూస్తే ఊరుకుంటానా? చంపేసి ఉందును. మూడేళ్ళు నాతో కాపురం చేసినా ఒక్కసారి కూడా పట్టుబడలేదంటే ఎంత జాణో మీరే ఊహించండి. ఓ మాట అడుగుతాను చెపుతారా?"

"అడగండి."

"మా ఆవిడ మీతో కూడా తిరిగిందా?" అని అడుగుతాడనుకున్నాడు పరాంకుశం. కాని, అది అడగలేదు. ఇనప చువ్వ ఎర్రగా కాల్చి, గుండెల్లో వాత పెట్టినట్లుగా అడిగాడు.

"ఇంతదాకా దాంతో ఎంత సంపాదించావు?"

పరాంకుశం అతని కాలర్ పట్టుకుని ఈ చెంపా, ఆ చెంపా వాయించాడు. అతను తప్పించుకోడానికి విఫల ప్రయత్నం చేసాడు కానీ  కుదరలేదు.

"రాస్కెల్. ఏం కూసావ్? నా పెళ్ళాం మీద మళ్ళీ అలాంటి నింద వెయ్యి, చంపేస్తాను."

అతను భయంగా పరుగెత్తాడు. ఇంటివైపు నడుస్తున్నా పరాంకుశం మనస్సు చివుక్కుమనేటట్లుగా వినిపిస్తూనే ఉన్నాయి అతని మాటలు.

"ఏమిటలా ఉన్నావు?" అడిగింది పరాంకుశం అక్కయ్య.

"ఏం లేదు."

వేడి వేడి కాఫీ గ్లాసుతో వచ్చింది సౌదామిని. వెనకనుంచి భుజాల మీదుగా పరాంకుశం ఛాతీమీదకి చెయ్యి వేసి అడిగింది.

"ఏమయింది చెప్పునాకయినా."

పరాంకుశం జరిగింది చెప్పాడు.

"హోష్! ఇంతేనా?" సౌదామిని నవ్వుతూ చెప్పింది.

కాస్సేపాగి అడిగింది.

"అలా అన్నందుకే వాణ్ణి కొట్టావు. నిజంగా అలా జరిగితే.... నేను అలా చేస్తే ఏం చేస్తావు నన్ను?"

"చాలాసార్లు చెప్పాగా."

***

*(తరువాయిభాగం వచ్చే సంచికలో)*

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

Click here to go to KOUMUDI Library

